దళారుల ఇష్టారాజ్యం

చేతికందిన మొక్కజొన్న పంట
- కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయని ప్రభుత్వం
- మద్దతు ధర లభించక నష్టపోతున్న రైతులు


తేమ తగ్గేందుకు ఆరబెట్టిన మొక్కజొన్నలు

రేగొండ: ఆరుగాలం కష్టపడి పండించిన మొక్కజొన్న పంటను అమ్ముకునేందుకు రైతులు తిప్పలు పడుతున్నారు. రైతులకు మద్దతు ధర కల్పించాల్సిన ప్రభుత్వం పంట చేతికందే దశలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి. కాని దిగుబడి సగానికి పైగా చేతికందిన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో దళారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా భావించి వారు ఇష్టారాజ్యంగా తక్కువ ధరకు తీసుకుంటూ జేబులు నింపుకుంటున్నారు.

5 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు

వానాకాలంలో అధిక వర్షాపాతం నమోదు కావడంతో పత్తి పంటలు దెబ్బతిన్నాయి. దీంతో మండలంలో పత్తి స్థానంలో రైతులు మొక్కజొన్నను సాగు చేశారు. సుమారుగా 5 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. నవంబర్‌లోనే మొక్కజొన్న సాగు చేయడంతో ప్రస్తుతం సగానికిపైగా పంట రైతుల చేతుకందింది. ప్రతీ ఏటా మొక్కజొన్న పంట చేతికందే సమయంలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుంటారు. కాని ప్రస్తుతం ఈ విషయంలో జాప్యం జరుగుతుండడంతో దళారులు మాయాజాలం ప్రదర్శించి మార్కెట్‌లో మద్దతు ధర కంటే తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో మార్క్‌ఫెడ్‌నుంచి స్పష్టత లేకపోవడంతో మొక్కజొన్న ధర తగ్గుతూ వస్తుంది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.2,225 ఉండగా వారం రోజుల క్రితం వరకు రూ.2,100కు కొనుగోలు చేసిన దళారులు క్రమంగా తగ్గిస్తూ ప్రస్తుతం రూ.2 వేలకు కొనుగోలు చేస్తున్నారు. ఇది కూడా మరింత తగ్గే అవకాశం ఉండటంతో, పెట్టుబడి వచ్చే పరిస్థితి ఉండదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి వరకు సుమారుగా 50 శాతం పంట చేతికందగా మిగతాది కంకులు విరవడం, ఆరబెట్టడం వంటి పనులు చేస్తున్నారు. కాగా, ఈ సంవత్సరం భూగర్భ జలాలు తగ్గడంతో చివరి దశలో నీరు సరిగా అందగా దిగుబడిపై కొంత ప్రభావం చూపిందని రైతులు వాపోతున్నారు. సాధారణంగా యాసంగిలో ఎకరానికి 35 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని, కాని ప్రస్తుతం 30 క్వింటాళ్లు దాటడం లేదని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే దిగుబడి రాక నష్టపోయామని మద్దతు ధర లభించకుంటే మరింత నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. ఎకరానికి 35 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉన్నప్పటికీ 25 క్వింటాళ్లే వచ్చింది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రం లేకపోవడంతో వ్యాపారులు రూ.2వేలకు అడుగుతున్నారు. ఆలస్యం చేస్తే ధర మరింత తగ్గే పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి.

– రఘుసాల తిరుపతి, రైతు

దళారులకు అమ్ముకున్నాం..



రైతుల అవసరాలను ఆసరగా చేసుకుని దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. గత్యంతరం లేక పంటను దళారులు అడిగిన ధరకే విక్రయిస్తున్నాం. కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తే గిట్టుబాటు ధర అందేది. సమయానికి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో దళారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

– మానూరి అశోక్, రైతు

క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

చిట్యాల: మండలంలోని నవాబుపేటలో పురాతనంగా నిర్మించిన శివాలయం శిథిలావస్థలో ఉండడంతో గ్రామస్తులు అంతా కలిసి చందాలు వేసుకుని ఆలయాన్ని నూతనంగా నిర్మిస్తున్నారు. ఈ మేరకు ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన కాల్వ సుగుణమ్మ కుమారులు కాల్వ రమేశ్‌రెడ్డి, సురేశ్‌రెడ్డిలు గురువారం రూ.1,00116 అందజేశారు. ఇంకా ఎవరైనా దాతలు ఉంటే ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధి కోసం కృషి చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ రత్నాకర్‌రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మోతుకూరి నరేష్, ప్రధాన కార్యదర్శి సర్వ శరత్, కోశాధికారి మందల రాఘవరెడ్డి, ఆలయ అర్చకుడు రఘునందన్ పాల్గొన్నారు.

గోదావరి పుష్కరాలపై నేడు సమీక్ష

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానంలో 2027 జూలైలో జరగనున్న గోదావరి పుష్కరాలపై హైదరాబాద్ జౌళిశాఖ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆధ్వర్యంలో సమీక్ష జరుగనుందని ఆలయవర్గాల ద్వారా తెలిసింది. కాళేశ్వరం దేవస్థానంలో 2015జూలైలో జరిగిన పుష్కరాల ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నారు. 12రోజుల పాటు ఎంత మంది భక్తులు పుష్కరస్నానాలు చేశారు.. ఎంత ఖర్చు చేశారు.. ఏమేమి సౌకర్యాలు చేశారు.. ఇంకా కావాల్సిన సౌకర్యాలు ఏమిటి అనే అంశాలను దేవస్థానం అధికారులతో నివేదికలు కోరారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది



కాటారం: ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని పీఆర్‌టీయూ టీఎస్ మండల అధ్యక్షుడు ఆంగోత్ రవీందర్, ప్రధాన కార్యదర్శి అనపర్తి తిరుపతి అన్నారు. మండలంలోని దామెరకుంటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వొల్లాల రాములు పదవీ విరమణ కార్యక్రమం గురువారం పాఠశాలలో నిర్వహించారు. రాములు దంపతులను పీఆర్‌టీయూ నాయకులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి ఎంతో కష్టంతో కూడుకున్నదని అన్నారు. ప్రతీ విద్యార్థిని ఉన్నతంగా తీర్చిదిద్దడానికి ఎంతగానో కృషి చేయాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు భగవాన్‌రెడ్డి, దేవినాయక్, గణపతినాయక్, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్

కాటారం: పెండింగ్ బిల్లులు చెల్లించాలని అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో మండలంలోని పలువురు మాజీ సర్పంచ్‌లను గురువారం పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఉదయం మాజీ సర్పంచ్‌లు రాహుల్, శేఖర్, రాజమౌళిని వారి ఇళ్ల వద్ద అదుపులోకి తీసుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం సొంత పూచికత్తుపై వదిలి పెట్టారు.

రామాలయానికి విద్యుత్ దీపాలంకరణ

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో నూతన కమిటీ ఆధ్వర్యంలో ఆలయం మాడవీధుల్లో సెంట్రల్ లైటింగ్, విద్యుత్‌దీపాలతో అలంకరించారు. ఎల్‌ఈడీ లైట్లతో స్వామివారి నామాలును ప్రత్యేక స్తంభాలకు అలంకరించి సుందరంగా తీర్చిదిద్దారు.

ఐకమత్యానికి ప్రతీక రంజాన్


భూపాలపల్లి రూరల్: ముస్లింలకు పండుగ సామగ్రి అందిస్తున్న సతీశ్


కాటారం: ఇఫ్తార్ విందులో ముస్లింలు, శశికాంత్

భూపాలపల్లి రూరల్: రంజాన్ పండుగ ఐకమత్యానికి ప్రతీకగా నిలుస్తుందని సీపీఐ 25వ వార్డు ఇన్‌చార్జ్ క్యాతరాజు సతీశ్ అన్నారు. రంజాన్‌ను పురస్కరించుకొని కారల్‌మార్క్స్ కాలనీలో 20మంది ముస్లిం కుటుంబాలకు సతీశ్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా (పండుగ సామగ్రి) అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సహాయ కార్యదర్శి యాకుబ్ పాషా, సాబీర్ భాషా, కసరబోయిన శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

కాటారం: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మండలంలోని విలాసాగర్‌లో గ్రామ యూత్ అధ్యక్షుడు పూసాల శశికాంత్ ఆధ్వర్యంలో గ్రామంలోని ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. స్థానిక మసీద్‌లో ముస్లింలతో కలిసి శశికాంత్, కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అట్టెం సత్తయ్య, పప్పుల రాజయ్య, చిగురు రాజు, మురుకుట్ల స్వామి, రాజసాగర్, మల్లయ్య, ముస్లిం మత పెద్దలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలలో రంజాన్ వేడుకలు

మల్హర్: మండలంలోని కొయ్యూరు గ్రామంలోని విశ్వదీప్తి పాఠశాలలో ప్రిన్సిపాల్ సుదర్శన్ ఆధ్వర్యంలో గురువారం ముందస్తు రంజాన్ పండుగ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సందర్శన్ విద్యార్థులకు రంజాన్ పండుగ గురించి అవగాహన కల్పించారు.

కార్పొరేట్ సెలూన్‌ను రద్దు చేయాలి


దీక్షలో పాల్గొన్న నాయకులు

- నాయీ బ్రాహ్మణ పట్టణ కమిటీ అధ్యక్షుడు రమేశ్

భూపాలపల్లి రూరల్: మంజూరు నగర్‌లో ఏర్పాటు చేయబోతున్న కార్పొరేట్ సెలూన్‌ను రద్దు చేయాలని జిల్లా కేంద్రంలో నాయీ బ్రాహ్మణ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణ కమిటీ అధ్యక్షుడు రమేశ్ మాట్లాడుతూ.. కార్పొరేట్ సెలూన్‌కు వ్యతిరేకంగా ఆరు రోజుల నుంచి నిరసనలు, బందు పిలుపునిచ్చి శాంతియుతంగా కార్యక్రమాలు చేపట్టిన ఫలితం లేకపోవడంతో దీక్ష చేపట్టినట్లు తెలిపారు. పట్టణంలో 200 పేద నాయీ బ్రాహ్మణ కుటుంబాలు కులవృత్తి చేసుకుంటూ జీవన ఉపాధి కొనసాగిస్తున్నారని తెలిపారు. కార్పొరేట్ సెలూన్ వెంటనే ప్రభుత్వం రద్దు చేయాలని కోరారు. దీక్షలకు మద్దతుగా ధర్మ సమాజ్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీందర్, తీన్మార్ మల్లన్న టీం అధ్యక్షుడు కైటం రవిపటేల్, బీసీ సంఘం నాయకులు భీమనాథుని సత్యనారాయణ, రమేశ్, రజక సంఘం నాయకులు శోభన్ బాబు, ముంజంపల్లి మురళీధర్, బీజేపీ టౌన్ అధ్యక్షుడు గీస సంపత్, మాజీ వైస్ చైర్మన్ హరీష్ రెడ్డి, నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయగిరి సమ్మయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మాదాసు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత


భూపాలపల్లి రూరల్: సెల్‌ఫోన్లు అందిస్తున్న సీఐ నరేష్‌కుమార్

భూపాలపల్లి రూరల్: మండల పరిధిలో ఇటీవల పలువురు సెల్‌ఫోన్లను పోగొట్టుకున్నారు. దీంతో వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా 16 ఫోన్లను రికవరీ చేశారు. ఈ మేరకు బాధితులకు ఎస్సై సాంబమూర్తితో కలిసి సీఐ నరేష్‌కుమార్ గురువారం అందజేశారు.



రేగొండ: ఫోన్ అందజేస్తున్న ఎస్సై

రేగొండ: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గుర్తించి బాధితుడికి ఎస్సై సందీప్‌కుమార్ గురువారం అందజేశారు. మండలంలోని రేపాక గ్రామానికి చెందిన నర్సయ్య పరకాలకు వెళ్తుండగా ఫోన్ పోగొట్టుకున్నాడు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను రికవరీ చేసి బాధితుడికి అందజేశారు.

ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న యూత్ సభ్యులు

కాటారం: మహాముత్తారం మండలంలోని యామన్‌పల్లికి చెందిన జాడి లక్ష్మణ్ ఇటీవల ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. దీంతో లక్ష్మణ్ కాలు విరిగి గాయాలపాలు కాగా ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నిరుపేద కుటుంబం కావడంతో ఆర్థిక ఇబ్బందులను తెలుసుకున్న మండలంలోని సామాజిక సేవ యూత్ సభ్యులు రూ.10 వేలను గురువారం ఆస్పత్రికి వెళ్లి కుటుంబ సభ్యులకు అందజేశారు. లక్ష్మణ్, రాజారాం, రత్నం సురేశ్, తరుణ్, రఘు, తిరుపతి, లక్ష్మిరాజు, రవి, కృష్ణ, మంజునాథ్ ఉన్నారు.

రేపు వారసంత నిర్వహణకు వేలం

టేకుమట్ల: మండల కేంద్రంలో ప్రతీ బుధవారం నిర్వహించే వారసంత(తైబజార్) నిర్వహణ బహిరంగ వేలాన్ని రేపు(శనివారం) గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉదయం తొమ్మిది గంటలకు నిర్వహించనున్నట్లు జీపీ కార్యదర్శి అడగాని సాంబశివరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు ముందస్తుగా రూ.10,000 దరావత్తు చెల్లించడంతో పాటు, ఆధార్ కార్డు, ఇంటి పన్ను రశీదులను సమర్పించాలని కోరారు.

గుంటూరుపల్లిలో పశు వైద్యశిబిరం


మందులు పంపిణీ చేస్తున్న గుమ్మడి శ్రీదేవి

చిట్యాల: మండలంలోని గుంటూరుపల్లిలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పశుసంవర్ధక శాఖ సౌజన్యంతో గురువారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పశువులకు, మేకలు, గొర్రెలకు వ్యాక్సిన్లు వేసి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి, పశుసంవర్ధక శాఖ అధికారి ఏడీ వెంకన్న, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రఫీ, డైరెక్టర్లు మేరుగు లక్ష్మి, రాజు నాయక్, మార్కెట్ సెక్రటరీ కనక శేఖర్, పశువైద్యాధికారి డాక్టర్ అజయ్, పశువైద్య సిబ్బంది లక్ష్మణ్, సుజాత, కరుణాకర్, సోనీ, మార్కెట్ కమిటీ సిబ్బంది బొచ్చు రాజు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఎస్సై అభినందన


సహస్రను అభినందిస్తున్న ఎస్సై సుధాకర్

టేకుమట్ల: మండల కేంద్రంలోని శాంతినికేతన్ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదో తరగతి విద్యార్థిని భూపెల్లి సహస్ర కేంద్రీయ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతి ప్రవేశానికి అర్హత సాధించింది. దీంతో గురువారం ఎస్సై దాసరి సుధాకర్ విద్యార్థినిని సన్మానించి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. పాఠశాల కరస్పాండెంట్ మియాపురం హరీష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న మినీ మేడారం జాతర


మొక్కులు సమర్పిస్తున్న నాయకులు

కాటారం: మండలంలోని జాదారావుపేట గ్రామ పంచాయతీ పరిధిలోని రఘుపల్లి శివారు మైలమ్మ చెలుకలోని సమ్మక్క సారలమ్మల మినీ మేడారం జాతర గురువారం రెండో రోజు కొనసాగింది. బీజేపీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆలయ పూజారులు పోచయ్య, లచ్చయ్య అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండో రోజులో భాగంగా సమ్మక్క తల్లి గద్దెపై కొలువుదీరగా అమ్మవార్లకు భక్తులు మొక్కులు సమర్పించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నాడు. బీజేపీ మండల అధ్యక్షుడు పాగె రంజిత్‌కుమార్, ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యుడు దుర్గం తిరుపతి, సీనియర్ నాయకులు గంట అంకయ్య, లింగయ్య, నేతకాని సంఘం యూత్ రాష్ట్ర అధ్యక్షుడు గజ్జె రాజ్‌కుమార్, గోమాసే విక్రమ్, శ్రీకాంత్, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ఒకే దేశం.. ఒకే ఎన్నికతోనే అభివృద్ధి

- బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కీర్తిరెడ్డి


రేగొండ: సమావేశంలో మాట్లాడుతున్న కీర్తిరెడ్డి

రేగొండ: ఒకే దేశం ఒకే ఎన్నిక విధానంతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. తరుచూ ఎన్నికలు నిర్వహించడంతో ప్రజాధనం వృథాతో పాటు కోడ్ కారణంగా అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోతున్నాయని అన్నారు. జిల్లా అధ్యక్షుడు నిశిధర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చదువు రాంచంద్రారెడ్డి, పార్లమెంట్ కో కన్వీనర్ లింగంపల్లి ప్రసాదరావు, నాయకులు పోలుసాని తిరుపతి, సుంకరి మనోహర్, తిరుపతిరెడ్డి, బుచ్చిరెడ్డి, బీజేవైఎం నాయకులు గాలిఫ్, కిరణ్, శంకర్, రాజు, మల్లేష్, రాకేష్, శివకృష్ణ, రాజుకుమార్ పాల్గొన్నారు.

భూపాలపల్లి రూరల్: పట్టణ కేంద్రంలో బీజేపీ అర్బన్ అధ్యక్షుడు సంపత్ కుమార్, మండలంలోని గొల్లబుద్దారంలో మండల అధికార ప్రతినిధి విప్లవ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఒకే దేశం ఒకే ఎన్నికపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెన్నంపల్లి పాపయ్య హాజరై మాట్లాడారు. ఒకే సారి ఎన్నికలు నిర్వహించడం వలన కలిగే లాభాలను వివరించారు. దొంగల రాజేందర్, రాజయ్య, సామల మధుసూదన్‌రెడ్డి, రేగల రవీందర్, ఊరటి మునేందర్, కుమార్, జోరు కృష్ణ, సేనాపతి పాల్గొన్నారు.

చిట్యాల: మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ వరంగల్ పార్లమెంట్ కో కన్వీనర్ లింగంపల్లి ప్రసాద్‌రావు హాజరై మాట్లాడారు. ఒకేసారి లోక్‌సభ, శాసనసభ ఎన్నికలు నిర్వహించడంతో పాటు వంద రోజుల లోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. వెంకటరాజవీరు, చెక్క నర్సయ్య, గజనాల రవీందర్, గుండ సురేష్, మాచర్ల రఘు, శ్రీకాంత్, స్వామి, సదానందం, రాకేశ్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

టేకుమట్ల: ఒకే దేశం ఒకే ఎన్నికపై మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు దేశెట్టి గోపాల్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రవీందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. దేశంలో ఒకేసారి ఎన్నికలు నిర్వహించడంతో ప్రజాధనం ఆదా అవుతుందన్నారు. మండల ప్రధాన కార్యదర్శులు బండారి సమ్మయ్య, గుర్రపు నాగరాజు, సోషల్ మీడియా కన్వీనర్ దుగ్యాల రాంచందర్ రావు, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి బట్టల మొగిళి, కూర సురేందర్‌రెడ్డి, సంపత్‌రావు, తిరుపతి, రామారావు, రమేష్, స్వామి, కిషన్‌రావు పాల్గొన్నారు.

నెరవేరనున్న పేదల కల

- ప్రారంభదశలో ఇందిరమ్మ ఇళ్లు
- ఆనందంలో లబ్ధిదారులు


పూరేడుపల్లిలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు

మంగపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంతింటి కలనెరవేరుతోండడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని అటవీ మారుమూల గ్రామమైన పూరేడుపల్లి గ్రామ పంచాయతీని ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకంలో పైలట్ గ్రామంగా ఎంపిక చేసింది. ఇందులో భాగంగా 63 మంది అర్హులను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అధికారులు, ప్రజాప్రతినిధులు అందచేశారు. లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల మేరకు సింగిల్ బెడ్‌రూం, కిచెన్, హాల్ నిర్మించుకోనున్నారు. ఇందుకుగాను ఇంటి బేస్‌మెంట్ లెవల్ పూర్తయిన వెంటనే రూ.లక్ష, రూఫ్ లెవల్ స్థాయిలో మరో రూ.లక్ష, స్లాబ్ లెవల్ పూర్తయిన తర్వాత రూ.2 లక్షలు, ప్లాస్టింగ్ కలరింగ్ పూర్తయిన తర్వాత మరో రూ.లక్ష చెల్లిస్తామని సంబంధిత అధికారులు లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి వెల్లడించారు. దీంతో పేదలు సంబురంగా నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారు. మంత్రి సీతక్క, సంబంధిత అధికారులు చొరవచూపి బిల్లులు సకాలంలో చెల్లించి ఇంటి నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

పనులు ప్రారంభం..

అధికారుల సూచనల మేరకు ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ఇంటి నిర్మాణం పనులను ప్రారంభించారు. గ్రామంలో 63 మందికి ఇళ్లు మంజూరు కాగా.. ప్రస్తుతం 40 మంది ఇంటి నిర్మాణం పనులు పునాది దశలో ఉన్నాయి. 5 ఇళ్లు బేస్‌మెంట్ లెవల్ వరకు పూర్తయ్యాయి. పనులు జరుగుతున్నప్పటికీ పనులపై సంబంధిత అధికారులు పర్యవేక్షణ లేకపోవడంపై లబ్ధిదారుల్లో అసంతృప్తి నెలకొంది.

సీతక్కకు రుణపడి ఉంటాం



ఇందిరమ్మ పథకం పైలెట్ ప్రాజెక్టుగా పూరేడుపల్లిని ఎంపిక చేయడం సంతోషంగా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రి సీతక్క చొరవతో కలలో ఊహించని విధంగా ఇళ్లు మంజూరు చేశారు. సొంతింటి కలను నెరవేర్చిన మంత్రి సీతక్కకు రుణపడి ఉంటాం.

– పూనెం నగేష్, పూరేడుపల్లి

సంతోషంగా ఉంది



ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడం, పనులను చేపట్టడం సంతోషంగా ఉంది. నిన్నటి వరకు పూరిగుడిసెల్లో జీవనం సాగించడం ఇబ్బందికరంగా ఉండేది. వర్షం వస్తే ఇల్లంతా కురిసేది. గత ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన మాట ప్రకారం మాకు ఇళ్లు మంజూరు చేసి, సొంతింటి కలను నెరవేర్చిన సీతక్క మేలు మరువలేం.

– బషీరా బేగం, పూరేడుపల్లి

నిబంధనల ప్రకారమే..

ప్రభుత్వ నిబంధనల మేరకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. ఇళ్ల నిర్మాణంపై ఇద్దరు మేస్త్రీలకు ట్రెనింగ్ ఇచ్చాం. నిర్మాణంలో ఎక్కడ కాంప్రమేజింగ్ ఉండదు. మధ్యవర్తుల ప్రమేయం ఉండదు. ప్రతి లబ్ధిదారులకు రూ.5 లక్షల వరకు విడతవారీగా చెల్లిస్తాం.

– సూర్యనారాయణ, పీడీ హౌజింగ్, ములుగు

'పోశాలు మృతి ప్రజా ఉద్యమాలకు లోటు'

గోవిందరావుపేట: పార్టీ సీనియర్ నాయకుడు అంబాల పోశాలు మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని పస్రా గ్రామంలో గురువారం అంబాల పోశాలు సంతాప సభ పాదిళ్ల చిట్టిబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కృష్ణారెడ్డి హాజరై.. పోశాలు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కృష్ణారెడ్డి మాట్లాడుతూ సీపీఎంలో అంబాల పోశాలు కృషి ఎనలేనిదని కొనియాడారు. 1969 నుంచి నేటి వరకు ప్రజా సమస్యలే ధ్యేయంగా పోరాటాలు నిర్వహించాడని తెలిపారు. ప్రజల కోసం, కష్ట జీవుల హక్కుల కోసం నిరంతరం పరితపించిన నాయకుడు పోశాలు అని కొనియాడారు. మంచి నాయకుడిని పార్టీ కోల్పోవడం బాధాకరమని అన్నారు. కార్యక్రమంలో బీరెడ్డి సాంబశివ, తుమ్మల వెంకట్ రెడ్డి, ఎండీ దావుద్, రత్నం రాజేందర్, తీగల ఆదిరెడ్డి, గొంది రాజేష్, సోమా మల్లారెడ్డి, కడారి నాగరాజు, ఉపేంద్రచారి, కృష్ణారావు, రామస్వామి, కోటేశ్వరరావు, లెనిన్ ఉన్నారు.